# నవలా కథనం - బద్దన్న సేనాని

- చంద్రలత

నవల, ప్రధానంగా, ఏదైనా కథ చెపుతుంది.

కథ చెప్పడంలో ప్రతి ఒక సంస్కృతిలో వారికే స్వంతమైన పద్దతులు ఉంటాయి. ప్రక్రియలు ఉంటాయి. మెళుకువలు ఉంటాయి. అవి ఆ సంస్కృతిలో అంతర్లీనమై అంతర్భాగమై పోతాయి.

నవల మనకు పరిచయం అయ్యేనాటికి - మన భారతీయ కథన విధానం అనేక అలంకార శాస్త్రాల నియమ నిబంధనల మధ్య - వ్యాకరణ అర్థ తాత్పర్య బేద భావాల మధ్య కొట్టు మిట్టాడుతూ - శుద్ధ పండిత ప్రకర్షగా నిలిచిపోయి ఉంది.

సామాన్యులది శ్రుత ఫలమే.

ఆనాటికి - పల్లె పదాల సొబగుకు, జానపదానికి సాహిత్య గౌరవం లేదు. అది పల్లీయుల నోట జీవించి ఉన్నది.

నవల  అంతకుముందు విస్తృతంగా ఉన్న సంప్రదాయ కావ్యరచనను తోసిరాజని, రూపంలో భావంలో, వస్తువుల్లో, కథలో, కథనంలో - కొత్తదనాన్ని ఆవిష్కరించింది.

ఈ సాహితీ ప్రక్రియతో ప్రవేశించిన సరళత, సమబద్దత (Uniformity) కథన విధానాలపై ప్రసరించింది.

నవల ఒక సృజనాత్మక కళ. ఒక కథన కళ.

నవల పుట్టినప్పుడు - అప్పటి సుసంపన్న భారతీయ కథన విధానాన్ని తోసిపుచ్చింది. ఆధునిక కథన శైలులు ఇంకా అంది రాలేదు. ఈ సందిగ్దంలో అటు సంప్రదాయ కథనానికి ఇటు ఆధునిక ప్రక్రియకు నడుమ - కొంత సంఘర్షణ జరిగి సంధి కుదిరింది. క్రమేణా సమగ్రత వచ్చింది.

"నవల అంతకు ముందున్న సాహితీప్రక్రియలలోని పరిమితులను అధిగమిస్తుంది. అపరిమితమైనది గానూ సశేషంగానూ అవతరిస్తుంది. "ఇది నవల స్వభావము" అంటారు యం. యం. భక్తిన్.

సాహితీరూపంగా నవల ఒక సమబద్దతను తీసుకువచ్చింది. ఆ మార్పులు ఇతర ప్రక్రియలపై కూడా ప్రభావం చూపాయి.

అయితే, 'ఇది సహజ పరిణామం కాబోదని, సామ్రాజ్యవాదంతో పాటు విస్తరించిన ఈ సాహితీ ప్రక్రియ - తమ అధీన దేశాల సంస్కృతీ వారసత్వాలలో కథ చెప్పే విభిన్న కథన శైలులను, ప్రక్రియలను, రూపాలను తుడిచి పెట్టేస్తూ - ఒక సాంస్కృతిక బానిసత్వానికి మూలమైందని' గూగీ వాధియాంగో వంటి వారి వాదన.

ఆఫ్రికా, లాటిన్ అమెరికన్ దేశాలలో సామ్రాజ్య విస్తరణకు - మన దేశంలో సామ్రాజ్య విస్తరణకు తేడాలున్నట్లే - ఈ 'సాంస్కృతిక బానిసత్వానికి' తేడాలున్నాయని గమనించాలి. అలాగే, తిరుగుబాటు లోనూ స్వతంత్ర వక్తీకరణ లోనూ తేడాలున్నాయి.

తెలుగు నవల ఇంగ్లీషు నవల ఆధారంగానే పుట్టింది.

నరహరి కృష్ణమ్మ రచించిన "శ్రీ రంగరాయ చరిత్ర' (1872) మొదటి నవలగానూ, కందుకూరి వీరేశలింగం గారి 'రాజశేఖర చరిత్ర' (1878) రెండవ నవలగానూ - తెలుగు నవల ప్రస్తానం ప్రారంభమై ఈనాటికి నూట ముప్పై ఐదేళ్ళు.

సామ్రాజ్య పుత్రిక అయిన నవలను ఆ సామ్రాజ్యం పైకే ఎక్కుపెట్టిన సాయుధంలా మలచినవారు మన నవలాకారులు. ఆ స్వతంత్రత మనకు జాతీయోద్యమానికి చేదోడువాదోడుగా నిలిచింది.

నవల కథ చెపుతుంది.

కావ్య సంప్రదాయానికి భిన్నంగా.

సామాన్యులు, అనామకులు, అర్భకులు - వీరందరి కథలు చెపుతుంది.

పురాణేతిహాసాలకు ప్రబంధ పౌరుషేయాలకు భిన్నంగా.

"సామ్రాజ్యవాదానిది ద్విముఖ వ్యూహం. ఒక వైపు కొల్లగొడుతూనే మరోవైపు తాయిలం పెడుతుంది. మొదటిది తిరుగుబాటుకు మూలమవుతుంది. రెండవది అధీనులను చేసి వుంచుతుంది" అంటారు. కె.ఎన్. పానిక్కర్.

ఇంగ్లీషు చదువులు విస్తృతమయ్యే నాటికి మనలో చదువు కొన్నవారు నామమాత్రమే. చాలా పరిమిత వర్గాలకే అక్షరజ్ఞానం లభ్యం. చదువుతో పాటు మనకు పాశ్చాత్య సంస్కృతీ వారసత్వాన్ని అందించింది - "సాంస్కృతికంగా ఆధీనంలోకి" తెచ్చుకొంటూ - సామ్రాజ్యం.

ఈ నేపథ్యంలో-

నవల ఒక ఆధునిక సాహితీ ప్రక్రియగా స్థిరపడింది.

ప్రపంచ వ్యాప్తంగా.

ఈ ప్రభావం ముఖ్యంగా పడింది 'కథనం'పై.

"నవల సంపన్నమైన వైవిధ్యమైన మాధ్యమం. ఇతర సాహితీ కథనాలలో ఉన్న భిన్న రూపాలు అన్నీ నవలాకథనంలో ఇమిడిపోతాయి. అలాగే, నవలాకథనం లోకి భిన్నత్వాలు ఇతర ప్రక్రియలపై ప్రసరిస్తాయి. అది సహజ కథనమైనా, నాటకం, సినిమా ఏదైనా-" అంటారు జాన్ మాన్‌ఫ్రెడ్.

నవల కథ చెపుతుంది.

సుసంపన్నంగా వైవిధ్య భరితంగా, బహుముఖంగా.

నవలకున్న ఈ సహజ లక్షణాన్ని మూలంగా చేసుకొంటూ, మన సంప్రదాయ కథన విధానాలన్నిటిని నవలలో ప్రవేశపెట్టిన వారు విశ్వనాథ సత్యనారాయణ.

విశ్వనాథ సత్యనారాయణ సంప్రదాయవాది. పండితుడు. కవి.

కావ్య సంప్రదాయం, వీరగాథ, ప్రణయగాథ, జానపదం, సాంఘికం, మనస్తత్వ విశ్లేషణ - ఇలాంటి అనేక ప్రక్రియలను నవలలో వాడడం ఒక ఎత్తైతే - సంప్రదాయ మౌఖిక కథనాన్ని (oral narrative tradition) ఆయన కొనసాగించారు.

ఈ కథన విధానం వలన ఆయన నవలలు 'వినసొంపు' గా ఉంటాయి. స్వరబద్ధమైన పదబంధాలు - లయాన్వితమైన వాక్య నిర్మాణాలు కథనాన్ని కవితాత్మకం చేస్తాయి. నవలా కథనపు నడకలో వేగం, విరుపు తెలుస్తూనే ఉంటుంది.

ఆయన పాఠకుణ్ణి ఒంటరిగా వదలరు. కథనంలో ఆయన పాండిత్య ప్రతిభ ప్రత్యక్షంగానే జోక్యం చేసుకొంటుంది. విశ్లేషిస్తూ. వివరిస్తూ. విమర్శిస్తూ.

కావ్యాలలో చంపూ వచనాలలా. నవలా కథనాలలో వివరాల్లా - ఆయన స్వరం ధ్వనిస్తూనే ఉంటుంది.

ఒక ఆధునిక ప్రక్రియను తన సంప్రదాయ వాదానికి మాధ్యమంగా మలుచుకున్న విశ్వనాథ నవలలో ఒకటి "బద్దన్న సేనాని".

బద్దన్న ఒక సామాన్యుడు. 'పొడుగు మనిషి కాడు. పొట్టివాడును కాడు. ఒక సామాన్య మానవుని వలె నుండెను. మొగము చూచినచో మర్యాద లక్షణములు కన్పించు చుండెను.'' (పేజీ 6)

బద్దన్న వీరోచిత పరాక్రమం - కాపాలభైరవునితో కత్తియుద్ధం - 'వీర'ంగము- ఆ దుడుకుతో వేగంతో నవలా కథనం ప్రారంభమవుతుంది.

" ఒక లక్ష కంఠముల నుండి "జయ! జయ! మహదేవ! శంభో! శంకర! యను మహానినాదములు' చెలరేగే నేపథ్యంలో కరవాల భైరవుణ్ణి సంహరించి - అతని శరీరం దగ్గర నిలబడి-

"ఇదుగో నేను శాసించుచున్నాను. ఇదిగో బద్దె, ఈ కట్టడి నెవ్వడును నుల్లంఘింప రాదు. నుల్లంఘించినచో నిదియె శిక్ష" (పేజీ 13) అంటూ గర్జించిన బద్దన్న - "ఆ సర్వ జనము మనోంతరాళముల యందు ఆ సమయముననే బద్దన్న మహాసేనానిగా ప్రతిష్ఠింప బడెను.'' (పేజి 15)

సంప్రదాయ బద్ధంగా - ఒక వీరుడి పరిచయం, ఒక మహాసేనాని ఆవిర్భావం, వీరోచిత విజయంతో కథనం ప్రారంభమైనా - కథలో మునుముందు జరగబోయే విషాదానికి ఒక సూచన కూడా ఇచ్చేశారు-

చివరి వరకూ, ఆ "మహాసేనాని" ప్రతిష్టించబడేది 'మనోంతరాళములందు' మాత్రమే, - సామాజికంగా రాజకీయంగా ఏనాటికీ సేనానిగా ప్రతిష్టించబడలేదు. అందుకు గల విషాద హేతువులను వెంటనే ప్రవేశపెడతారు.

వీరగాథ ప్రణయగాథ లా మారుతుంది.

అది సమాజ బద్ధమైన ప్రేమ కాదు. తనకంటే పదేళ్ళు పెద్దది, తనకు గురువు. వివాహిత అయిన స్త్రీని - బద్దన్న ప్రేమిస్తాడు. వారిద్దరి ప్రణయం, సహజీవనం - ఈ విషాదాంత నవలకు ఒక విషాదహేతువు.

అసలు కారణం మరొకటి ఉంది. అది బద్దన్న కులం.

" నా కులం పంచమ కులం. ఈ సామ్రాజ్య రక్షణ కొరకై వందల యేండ్లుగా నెన్ని కోట్లమంది నా కులము వారు తమ రక్త బిందువలొడ్డిరో !" బద్దన్నకు తన కులం తెలుసు. బలం తెలుసు. బలహీనత తెలుసు.

"శాస్త్రములందు కూడా నుత్తరోత్తరము బలీయమందురు. అన్నిటి కన్నా నుత్కృష్టమైన బలము గలది మా కులము." (పేజీ 15)

"యుద్ధము వచ్చినచో మేము సేన. లేనిచో పాలేరలము. మాలో దేముడు పుట్టిన మీకు బంటులమే." (పేజీ 58)

"కానీ, ప్రజలందరకు బద్దన్న మీద గౌరవము కలదు. ఒక పురాధిపతి యను గౌరవమే కాక, సైన్యాధిపతి యనియు, రాజ్యములను నల్ల కల్లోలము చేయగల నేర్పరి యనియు, బ్రజలందరకు అతని మీద ఒక మహాభిప్రాయముండెను-"

అయినప్పటికీ, ఎలాంటి మినహాయింపులు లేకుండా నాయికానాయకులు సామాజిక వివక్షకు, అంతకు మించి రాజకీయ కుతంత్రానికి బలవుతారు.

"మన కులములో నా వంటి స్త్రీ యుండదు. నీ వంటి పురుషుడుండడు-" అని బాదమ్మ అనడంలో ఏ మాత్రం అసంగతం లేదు.

బద్దన్న మహా సేనాని, పురాధిపతి అయినప్పటికీ, అది 'ప్రజల మనోంతరళాల'లోనూ, రాజసపత్రాలలోను మాత్రమే. అమలుకు నోచుకోదు. సాధ్యం కాదు.

సేనను వీడి, పురాన్ని చేరక - అజ్ఞాతంలో గడుపుతూ బద్దన్న బాదమ్మలు ఇరువురూ - కూలీనాలీ చేస్తూ పొట్ట గడుపుకోవలసి వస్తుంది.

ఇది సామాజిక వాస్తవికత.

ఈ కథన క్రమం అంతటిలోనూ - అంతర్ముఖం గానూ, సంభాషణల ద్వారాను - వారిరువురూ అంతరంగ అన్వేషణ కొనసాగించడం - మనస్తత్వ విశ్లేషనా కథనం. స్త్రీ పురుష సంబంధాలలో స్వేచ్ఛాకాముకత విస్తృతంగా చర్చించబడుతోన్న ఆ రోజులలో ఇది ఒక పరిణిత పరిణామ విశ్లేషణ.

"తాను బాదమ్మను ప్రేమించెను. అతని యుద్దేశ్యములో నది ధర్మము. అది యెవ్వరును కాదనరనుకొనును. అతని కందులో దోషము కన్పించదు. తాను ప్రేమించెను కావున నెవ్వరును దానిని దోషమనరాదు. అతని యహంకారం, స్వాభిమానం వాని యాత్మతో ముడిపడెను. ఈ ప్రపంచమునకు మొట్టమొదటి వాడు తాను, ఈ జగత్తు తన కోసమున్నది. ఇది తాను శాసించినట్లు నడువ వలయును. మనస్సు ఈ పద్ధతి మీద నడుచును" (పేజీ 69)

బద్దన్న ఆలోచనలు ఈ విధంగా వుంటే, బాదమ్మ మరొకలా ఆలోచిస్తున్నది.

"ఇంతకు దాను కారణము. తాను తిప్పన్నను వదిలి యీ పసివానితో నేలవచ్చెను? ప్రధానముగా నతని యౌవనము చేత నాకర్షింప బడెనా - అట్లుకాదు. అతని విద్య చేత నాకర్షింపబడెనా? అదియును గాదు- ఆ విద్యా ప్రకటన సమయము నందలి ప్రతిభావిశేషముల చేత నాకర్షింపబడెనా? కొంతమట్టుకు గావచ్చును. ప్రధానముగా నతని యీ పతనమునకు దానేల కారణమయ్యెను?" (207 వ పేజి)

బద్దన్న మహావీరుడు ఒక జారుడు గా పరిషత్తు ముందు నిలబెట్టబడినప్పుడు- 'నామె మనస్సునకు నా వెనుక యున్న యూహ పొడకట్టెను.'

"బాదమ్మ తన యంతరాంతము వెదకి చూచెను. బద్దన్న శైవుడు. తాను వైష్ణవి. చాలా దినములుగా బద్దన్న యంతటివాడు శైవుడై యుండుట కామె మనస్సంగీకరించలేదు. ... 'ఆలోచించగా నాలోచించగా నది ప్రధానకారణం అనీ, తక్కినవి యుపకారణములనీ నామె బుద్ధికిఁ దోచెను."

ఈ లోగా విశ్వనాథ వారిరువురి ప్రేమను అనేక రూపాలుగా సూత్రబంధం చేస్తారు. శారీరకధర్మమనీ, దైవదత్తమనీ- అయితే, అసలు కారణాలేమిటో నాయికానాయకులే తడమి చూస్తారు.

నవలాకారుని కథనానికి మించి పాత్రలు స్వతంత్రత పొందుతాయనడానికి ఇది ఒక ఉదాహరణ. నవలలో అనేక సందర్భాలు ఉన్నాయి.

బాదమ్మ 'జానపద స్త్రీ సర్వ సౌందర్యము సర్వ యౌవన శోభయామె యందే యుండెనన్నట్లు'గా ఉండి, కత్తియుద్ధంలో బద్దెన్నకే గురువు తాను. అటు పిమ్మట, ప్రణయ గురువు.

నాయికా నాయకుల కట్టుబొట్టు, తీరుతెన్నులు, పొలాల పైని ప్రణయాలు, ఇసుక తిన్నెలపై విహారాలు, సరససల్లాపాలు- పల్లీయుల ముచ్చట్లలా - మురిపెంగానే వుంటాయి.

సంభాషణలు చిన్న చిన్న మాటలతో చమత్కారంగా చలాకీగా సాగుతాయి.

బ : నీవు తిప్పన్న భార్యవు.

బా: ఇది వరకు.

బ: ఇప్పుడును.

బా: కావచ్చును.

బ: ఇకముందు?

బా: ఇక ముందు మండుటిసుకలు, కృష్ణపాయ, నీ కాళ్ళు మండుచున్నవి. నా కాళ్ళు మండుచున్నవి. రావి చెట్టు క్రిందికి బోవుదము రమ్ము.

ఇక, విశ్వనాథ నవలలో ఎక్కడిక్కడ తన విశేష విజ్ఞానాభాండంతో పలకరిస్తూ వుంటారు. అది కత్తియుద్ధమే అనుకోండి. అటు వీరుల యుద్ధ మర్మాలు వివరిస్తూనే రమణీమణుల రైకచుట్టు, కాసెకోకలను నటికే మెళకువలు వివరిస్తారు. ఖడ్గవిద్యలో గురువు శిష్యుని ముద్దు పెట్టుకోవడం ఎలాగో చెప్తూనే, నాయిక కాసెకోక నటుకాలనే నాయకుడి సరసోద్రేకాన్ని చిత్రిస్తారు.

" భక్తి జ్ఞాన వైరాగ్యములు మూడును మూడు విధములైన మనుష్యుల వద్ద నుండును.'' - అంటూ చేసే విశ్లేషాత్మక వివరణలలోని భాష వేరు. నిండైనది. పండిన పండిత భాష.

కావ్య సంప్రదాయపు అలంకారాలు, 'అతిశయోక్తి' అణిచిపెట్టినా అంచెలంచెలుగా కథనంలో ప్రతిఫలిస్తుంది. అరసున్నాలు, టకార టుకారాగమ సంధులు, సమాసాలు సర్వసాధారణం.

కొనగోటితో గెలవ గలిగిన యుద్ధాన్ని బద్దన్న చేజేతులా ఓడిపోతాడు చివరికి. పర్యవసానంగా ఆ మహావీరుడు పదిమంది మధ్యలోనే హత్య చేయబడతాడు. నాయిక ఆత్మహత్య చేసుకొంటుంది.

ఈ వీరమరణం వెంటనే ప్రతి పల్లె పొలిమేరల్లో కనబడే "వీరగళ్ళ" ను జ్ఞాపకం చేస్తుంది. ఇలాంటి కథ ఏదైనా దాగివుందా ఆ 'వీరకొలువుల' వెనుక అని అనిపిస్తుంది.

బద్దెన్నను ఓడించిన సాంఘిక కారణాలు సామాజిక కట్టుబాట్లు మాత్రమే కాక, మరో సున్నిత పార్శ్వాన్ని కూడా విశ్వనాథ ప్రస్తావిస్తారు.

మూక్తి గత ఈర్ష్యాద్వేషాలు - (అది రాజకీయ కుతంత్రం) వాటికి ఆజ్యం పోస్తాయి.

"ఒక వ్యక్తి యందు అసూయచేత నంబయ్యగారింతటి మహాకార్యమును పాడు చేసికొనునా?'' మందయ్య ఆలోచిస్తాడు, "బద్దన్న వట్టి విరాగి. ఈ ప్రయత్నము ప్రయత్నము కొరకు చేయుచున్నాడు. వట్టి స్వాతంత్రాభిలాష చేతనే చేయుచుండెను. అతనికి అధికార వాంఛలేదు.'' కాబట్టి, పోటీలేదు. అంతకన్నా ముఖ్యమైన విషయం మరోటి ఉంది, "బద్దన్న పంచమ కులస్థుడు. అతని ఈ మహా ప్రయత్నములో నధిక భాగము వాడలలో జరుపుచుండెను. ఎప్పుడు చాళుక్య సైన్యముల నా జాడలు సులభముగా నవగతము కావు. అబ్బో - ఏమి కులమది అచ్చటి రహస్యము బ్రహ్మ భేద్యము. బద్దన్న కానిచో నీ పని వేరొకరు చేయలేరు- (పేజి 130)

అదీ అసలు మర్మం.

అనాదిగా అంచెలంచెలుగా అణిచి వేయబడుతూ- దోపిడికి గురవుతోన్న వైనం.

సైన్యం కావాలి - దానిని ఏర్పరచగల - నడపగల నాయకుడు కావాలి. అతడు అణగిమణిగి ఉండాలి. ఇది రాజకీయ కుట్ర, కుతంత్రం, స్వార్థం, దౌర్జన్యం, దోపిడి.

బద్దన్నను ఓడించిన సాంఘిక కారణాలతో పాటు బద్దన్నను నిర్వీర్యం చేసిన మానసిక బానిసత్వాన్ని- అధ్యయనం చేయవలసి వుంది.

నవలకు సహజంగా ఉండే ఆధునిక హేతుబద్ధతకూ - నవలాకారుడు తనని తాను నియంత్రించుకున్న సంప్రదాయ బద్ధతకూ మధ్య - 'పొసగని తనం'- ఈ నవలా కథనంలో స్పష్టంగా కనబడుతుంది. బద్దన్నా, బాదమ్మలు నవలకు మించి నవలాకారునికి మించి మూర్తిమత్వం పొందుతారు. విస్తరించిపోతారు.

అటు ఉన్నవ లక్ష్మీనారాయణ గారికి ఇటు చలం కు - "మధ్యేమార్గంలో కాక పూర్తిగా బండి వెనక్కి తిప్పే ప్రయత్నం చేసిన రచయిత, కవి- " విశ్వనాథ అంటారు ఆరుద్ర. విశ్వనాథకు సనాతన వ్యవస్థపై గల గాఢానురక్తి, నమ్మకం ఎటువంటి అలంకరణ మొహమాటం లేకుండా ఎటువంటి పునరాలోచన లేకుండా ప్రకటింపబడ్డాయి. కథనాన్ని విశ్లేషించడం ఒక ఎత్తు, రచయిత భావజాలపు ఇంద్రజాలం నుండి మెలుకవగా తప్పించుకు బయట పడటం మరో ఎత్తు. ఇది పాఠకుడి విజ్ఞతకు, రసజ్ఞతకు మంచి సవాలే సుమా.

ఏది ఏమైనా, కథన పరంగా ఒక మారు విశ్లేషించవలసిన నవల 'బద్దన్న సేనాని'

ఇది పూర్తిగా వీరగాథ కాదు. అలాగని జానపదమూ కాదు. చారిత్రికమూ కాదు. సమకాలీనము కాదు. యథార్థమూ కాదు. సాంఘికమూ కాదు. మానసిక విశ్లేషణ కాదు. ప్రణయగాథ  కాదు. వైరాగ్యమూ కాదు.

అన్నిటినీ కలనేసిన ఒక నవల.

విశ్వనాథ తాను విశ్వసించిన సిద్ధాంతాలను బలోపేతంగా సమర్థించుకొనే క్రమంలో- ఆయన ప్రాచీన తత్త్వంతో పాటు - కథన విధానంలో ప్రాచీనత్వాన్ని పదిలపరచడానికి - ఆధునిక సాహితీ ప్రక్రియ అయిన నవలను సమర్థవంతంగా వాడారు.

వివిధ కథన ప్రక్రియలను విశ్వనాథ వాడిన తీరును విశ్లేషించవలసి వున్నది.

ఎందుకంటే, పాశ్చాత్య పోకడలకు భిన్నంగా సాంప్రదాయబద్దంగా స్థానిక కథన శైలులను విలీనం చేసుకొంటూ కథను చెప్పడం - విశ్వనాథ నేర్పరితనం.

'సంప్రదాయానికి ఆధునికతకు మధ్య కుదిరిన ఇలాంటి సాంస్కృతిక సయోధ్య- నిజానికి సామ్రాజ్య వాదంపై ప్రకటించిన తిరుగుబాటు'లో అనివార్యంగా జరిగిన పరిణామమని కె.ఎన్. పనిక్కర్ లాంటి వారి అభిప్రాయం.

నవలా కథనంలోని బహురూపాలను, పలు మెళుకువలను ఒక చోట తడిమి చూడాలంటే- 'బద్దన్న సేనాని'ని చదివి చూడవచ్చును.

**References:**


1. బద్దన్న సేనాని - (నవల) - విశ్వనాథసత్యనారాయణ
2. Decolonising the mind : The Politics of Language in African Literature- By Ngugi Wa Thiongo
3. Narratology : A Guide to the Theory of Narrative, Jahn, Manfred.
4. Colonialisation, Culture and Resistance by KN Panikkar.
5. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర
6. Theory of Novel, M M Bakthin